క్లుప్తంగా

పూలే విదేశీ విద్యాజ్యోతి పథకంలో బీసీల కోటా పెంచాలి



కేయూ క్యాంపస్: పూలే విదేశీ విద్యాజ్యోతి పథకం కింద విదేశాలకు వెళ్లే బీసీ విద్యార్థుల సంఖ్యను పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సంవత్సరం సుమారు 300 మంది బీసీ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్నారని అన్నారు. ఆ సంఖ్యను వెయ్యికి పెంచి ఈ పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ సుదర్శన్ రెడ్డి సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏకశిల కాన్సెప్ట్ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణకు పాఠశాల విద్యార్థులతో కూడిన ప్రహరీ క్లబ్‌ను సోమవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ నాశనం అవుతుందని అన్నారు. అనంతరం, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రొఫెసర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేసును ఉపసంహరించుకోవాలి



వరంగల్: ఆజంజాహి మిల్లు కార్మిక భవన స్థలంపై పోరాటం చేస్తున్న కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలపై వస్త్ర వ్యాపారి ఓం నమశ్శివాయ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. కాశిబుగ్గలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆజంజాహి మిల్లు కార్మికుల స్థలం, కార్మిక భవనం కూల్చివేత సంఘటనపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ఆ స్థలం రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుని కార్మికులపరం చేయాలని తీర్మానం చేశారు. ఈ డిమాండ్లు నెరవేర్చకుంటే అన్ని పార్టీలతో కలిసి సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎంసీపీఐ(యూ), ఇఫ్టూ, టీపీఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు నలిగంటి రత్నమాల, గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, సాగర్, నర్రా ప్రతాప్, అక్కెనపల్లి యాదగిరి, నున్నా అప్పారావు, కొంపెల్లి ప్రవీణ్, జనగాం కుమారస్వామి, చుక్క శ్రీను, నరసింహారావు, హరిబాబు, ఏజే మిల్ కార్మికుల సంఘం నాయకులు ఇనుముల శ్రీనివాస్, డాక్టర్ కె.కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మణ్, ఆర్ఎస్పీ నాయకులు వల్లందాస్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అవకతవకలు



నయింనగర్: 2024 – 25 ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.300 కోట్లు కేటాయించినా అందులో కేవలం 41.86 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇంకా 1.2 లక్షల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జక్రియా సోహెల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మన్నాన్ తెలిపారు. దాంతో అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యావ్యవస్థలో అడ్డంకులు ఏర్పడుతున్నాయని వాపోయారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యా, యువజన సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులపై సిఫార్సులు చేస్తూ తెలంగాణ ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంక్షేమం మాటల్లో కాకుండా బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా చూపించాలని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సమయానికి, పారదర్శకంగా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫరాజ్, హసీబ్, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలో గౌరీశంకర ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘రైతు భరోసా’కు ఎదురుచూపులు



పట్టాదారు పాసుపుస్తకం ఉన్నా అందని సాయం



నీరుకుళ్లలో రైతుభరోసా, తదితర పథకాలపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

- ఖాతాల్లో జమకాని పెట్టుబడి సాయం
- స్పందించని అధికారులు
- కారణాలు తెలియక రైతుల అయోమయం

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా పెట్టుబడి సాయం కొందరు రైతులకు అందకపోవడంతో ఎదురుచూస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం పొంది ఉన్నప్పటికీ నిబంధనలకు లోబడి భూమి కలిగి ఉన్న రైతులకు కూడా రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లో జమ కాకపోవడంతో ఆలోచనలో పడ్డారు. తోటి రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని, తమ ఖాతాల్లో ఎందుకు జమ కాలేదని సదరు రైతులు బ్యాంక్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇటీవల గ్రామసభలు నిర్వహించిన అధికారులు.. అర్హులైన రైతులు నుంచి వివరాలు స్వీకరించిన విషయం తెలిసిందే. కానీ తాము అర్హులైనప్పటికీ రైతు భరోసా రాలేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. 15 గుంటల నుంచి 3 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా రాలేదని ఓ రైతు వాపోయాడు. రైతు భరోసా సొమ్ము వస్తే పంటసాగు పెట్టుబడికి సులవు అవుతుందని భావించామని, డబ్బులు అకౌంట్‌లో జమ కాకపోవడంతో అయోమయంగా ఉందని అంటున్నారు. రైతు భరోసా అందని రైతులు తహసీల్దార్ కార్యాలయం, మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి వెళ్లి అడిగినా న్యాయం జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఏ అధికారిని అడిగినా సరియైన సమాధానం చెప్పడం లేదని వాపోతున్నారు.

సాంకేతిక కారణాలతోనే..

మండలంలో కొంతమంది రైతులకు రైతు భరోసా సొమ్ము జమకాలేదు. అయితే సాంకేతిక కారణాల వలన జమకాలేదు. ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- శ్రీనివాస్, ఏఓ

రైతు భరోసా సొమ్ము రాలేదు



నాకు అగ్రంపహాడ్ శివారులో ఎకరా 16 గుంటల భూమి ఉంది. పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉంది. గతంలో నాకు రైతు భరోసా సొమ్ము ఖాతాలో జమ అయ్యేది. కానీ ప్రస్తుతం ఇప్పటివరకు కాలేదు. ఆ డబ్బులు వస్తే పెట్టుబడికి అవసరం అవుతాయని ఆశ పడినా అడియాశ అయ్యింది.

- కూస కుమారస్వామి, అగ్రంపహాడ్ శివారు రైతు

అధికారులు స్పందించడం లేదు



నాకు పెద్దాపూర్ శివారులో 3ఎకరాల 27గుంటల పట్టా భూమి ఉంది. ప్రభుత్వం అందచేసిన పట్టాదారు పాస్‌పుస్తకం ఉంది. అయినా నాకు రైతు భరోసా సొమ్ము ఇప్పటికీ ఖాతాలో జమ కాలేదు. అధికారులను అడిగితే స్పందించడం లేదు. ప్రభుత్వం అర్హులందరికీ న్యాయం చేయాలి.

- దేవరాజు, రైతు, పెద్దాపూర్ శివారు

ఏకకాలంలో జమచేయాలి



ప్రభుత్వం రైతులందరికీ ఏకకాలంలో రైతు భరోసా పెట్టుబడి సాయం జమచేయాలి. చాలామంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉండి అర్హులైనప్పటికీ రైతు భరోసా జమకాలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి రైతు భరోసా సొమ్ము జమచేయాలి.

- రాధరవియాదవ్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్

‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి, అనూష

ఆత్మకూరు : సఖి సేవలను వినియోగించుకోవాలని సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ అనూష అన్నారు. మండలంలోని అక్కంపేట జెడ్పీహైస్కూల్‌లో సోమవారం సఖి ఆధ్వర్యంలో సఖి సెంటర్ లక్ష్యాలు, బాలికల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సఖి సెంటర్‌ను సంప్రదించాలన్నారు. మహిళ హెల్ప్‌లైన్ నెంబర్ 181, చైల్డ్ లైన్ నంబర్ 1098కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కౌన్సిలర్ రజిత, జెండర్ స్పెషలిస్టు మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి దాతల చేయూత



ఐనవోలు : చెక్కు అందజేస్తున్న సీఐలు, ఎస్సైలు

ఐనవోలు : 2016 సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన ఎస్సై అంబేడ్కర్ మృతిచెందాడు. దీంతో 2012 బ్యాచ్ ఎస్సైలు మృతుడి తల్లిదండ్రులకు సోమవారం రూ.4లక్షల చెక్కును అందజేశారు. చెక్కు అందించిన వారిలో సీఐలు శ్రీనివాస్, సురేష్, రవీందర్, ఎస్సైలు పస్తం శ్రీనివాస్, రాజు, రవికుమార్, వెంకన్న, శ్రీకాంత్, ప్రభాకర పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థికసాయం

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన మాదారపు రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రమేశ్‌తో 10వ తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు రూ.20వేల నగదు, 25కిలోల బియ్యాన్ని అందించారు. గౌస్, బుచ్చన్న, పూర్ణచందర్, మహేందర్, సురేందర్, రాజు, రమేశ్, సతీశ్, సుమలత, రమణారెడ్డి పాల్గొన్నారు.

‘తిరుపతి’ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

- ఎమ్మెల్యే రేవూరి, కుడా చైర్మన్ ఇనగాల

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మత్స్య సంఘం మాజీ చైర్మన్ బయ్య తిరుపతి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తిరుపతి అంత్యక్రియలు సోమవారం జరిగాయి. ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి తిరుపతి మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజు, వాసు, కిరీటి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట యోధుడు కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర పోరాట యోధుడు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అని ఆ పార్టీ శ్రేణులు కొనియాడారు. ఆయన జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శాయంపేటలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కార్యకర్తలూ.. పరకాల పట్టణంలోని సివిల్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా సంబురాలు చేసుకుని నినాదాలు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



శాయంపేట : కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి



ఆత్మకూరు : కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



ఎల్కతుర్తి : కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ నాయకులు

మూడు రోజులపాటు విద్యుత్ అంతరాయం

దామెర : మండలంలో 220కేవీ విద్యుత్ టవర్ల నిర్మాణం, నూతన లైన్ల పనుల్లో భాగంగా 11కేవీ ఒగ్లాపూర్ లైన్ క్రాసింగ్ ఉండడం వలన మంగళవారం నుంచి ఈనెల 20 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండనుందని ఏఈ రమేశ్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఒగ్లాపూర్, దమ్మన్నపేట, తక్కళ్లపాడు గ్రామాలకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఏకశిల విద్యార్థుల సేవాభావం



దామెర : మండల కేంద్రంలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం సహృదయ ఓల్డ్ ఏజ్ హోమ్‌ని సందర్శించారు. నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దుస్తులు, చీరలు అందించారు. సేవాభావం చాటుకున్న విద్యార్థులను ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇంచార్జ్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు నవీన్, స్వరూపరాణి, మమత, వినయ్ పాల్గొన్నారు.

డార్విన్ సిద్ధాంతంపై అవగాహన

ధర్మసాగర్ : డార్విన్ పరిణామ సిద్ధాంతంపై అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక, రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాశ్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని సెయింట్ మ్యాథ్యూస్ పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రకుమార్‌కు డాక్టరేట్

దామెర : మండల కేంద్రానికి చెందిన అల్లం రాజ్‌కుమార్ భౌతికశాస్త్రంలో ఎఫెక్ట్స్ ఆఫ్ ట్రాన్సీషన్ మెటల్ అయాన్స్ డోప్డ్ స్ట్రాన్షియమ్ మెగ్నీషియం ఫాస్ఫేట్ నానో పౌడర్స్ అనే అంశం సమర్పించిన గ్రంథానికి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ పరిశోధన డాక్టర్ ఎస్.అరుంధతి పర్యవేక్షణలో పూర్తిచేసినట్లు రాజేంద్రకుమార్ తెలిపారు. చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ సీహెచ్‌వీ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్విక రెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, పరీక్షల నియంత్రణ అధికారి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట : మహాత్మా జ్యోతిబాపూలే, అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్‌కలాం, సేవారత్న, ఉత్తమ సర్పంచ్, ఉత్తమ ఎంపీటీసీ, విద్యారత్న, ఉమెన్ లీడర్షిప్ వంటి జాతీయ అవార్డుల కోసం అర్హుల నుంచి దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమి అవార్డు సెలెక్షన్ కమిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్ సోమవారం తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే మహారాష్ట్రలోని పూణెలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమి 18వ జాతీయ సమావేశంలో అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవార్డులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పూలే, అంబేడ్కర్ సిద్ధాంత భావజాలంతో పని చేసే ఇతర వర్గాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు, ఇతర వివరాలకు 9989949653, 7386409653ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ప్రణవ్

కమలాపూర్ : త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. మండలంలోని కన్నూరులో సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలంతా సమిష్టిగా సమన్వయంతో పనిచేసి విజయం దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణిరవీందర్, నాయకులు రమేశ్‌గౌడ్, గుండపు చరణ్‌పటేల్, పుల్లూరి శ్రీనివాసరావు, నాంపెల్లి ప్రభాకర్, బొల్లం రాజిరెడ్డి, డాక్టర్ మౌటం కుమారస్వామి, పోడేటి భిక్షపతి, మాట్ల రమేశ్, తడక శ్రీకాంత్, ఏఎంసీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

‘చలో విద్యుత్ సౌధ’ను జయప్రదం చేయాలి



చలో విద్యుత్‌సౌధ వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అమానుల్లా తదితరులు

కమలాపూర్ : విద్యుత్ ఆర్టిజన్స్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర నాయకుడు అమానుల్లా పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో చలో విద్యుత్ సౌధ వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఐటీఐ చేసిన ఆర్టిజన్స్‌కు జేఎల్ఎం, జేపీఏ పోస్టులు, డిగ్రీ, పీజీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, డిప్లొమా చదివిన వారికి సబ్ ఇంజనీర్ పోస్టులు, టెన్త్, ఇంటర్ చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు, చదువుకోని వారికి తగిన ఉద్యోగం కల్పించాలని, మొత్తంగా తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్స్‌ను కన్వర్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవన్‌కుమార్, కోడెపాక రవీందర్, చందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

- పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని కొప్పులలో శ్రీలక్ష్మి, భూలక్ష్మి సమేత సీతలాంబ (బొడ్రాయి), పోచమ్మ తల్లి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీలక్ష్మి, భూలక్ష్మి సమేత సీతలాంబ (బొడ్రాయి), శ్రీపోచమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. కొప్పుల గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేతో రైతులకు మేలు



యాప్‌లో పంట వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ రాజశేఖర్

వేలేరు : డిజిటల్ క్రాప్ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని ఏఈఓ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వేలేరు క్లస్టర్ బండతండా గ్రామంలో రైతులు సాగు చేసిన పంట వివరాలను యాప్‌లో నమోదు చేశారు. క్లస్టర్ పరిధిలోని సుమారు 2 వేల ఎకరాల్లో వేసిన పంటల వివరాలను, వాటి ఫొటోలను ఏఈఓలు స్వయంగా పరిశీలించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆయనతో పాటు రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

హేమలత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాజు

దామెర : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన నల్లెల హేమలత ఇటీవల మృతిచెందింది. ఆమె ఆత్మకూరు డీసీసీ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం బీమా కలిగి ఉండగా రూ. 2లక్షల బీమా డబ్బులు మంజూరు అయ్యాయి. దీంతో పెద్దపూర్ పీఏసీఎస్ చైర్మన్ బొల్లూ రాజు, బ్రాంచ్ మేనేజర్ హరిత హేమలత కుటుంబ సభ్యులకు సోమవారం చెక్కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ బీమా పాలసీ పొంది ఉండాలని అన్నారు. వారి వెంట అసిస్టెంట్ మేనేజర్ ఫైయాజ్, సీఈఓలు శ్రీనివాస్, ఓంరెడ్డి, లక్ష్మయ్య, రాజేశ్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

కమలాపూర్ : ఎంఈఓ (ఎఫ్ఏసీ)గా కన్నెదారి శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎర్ర రాంకిషన్‌రాజు గతనెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో మండలంలోని శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీధర్‌కు ఎంఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆర్జేడీ, డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీధర్ ఎంఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించి సోమవారం విధుల్లో చేరారు. అందరి సహాయ, సహకారాలతో మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కాగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలుకగా, మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు.



దామెర : ఎంపీడీఓ విమలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎంపీడీఓగా విమల

దామెర : ఎంపీడీఓగా గజ్జెల విమల సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ రాజు పుష్పగుచ్ఛం అందించారు.